క్లుప్తంగా

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



రత్నాచార్యులును సన్మానిస్తున్న ఎ.వి.సూర్యనారాయణ

బూర్జ: మండలంలోని పెద్దలంకాం గ్రామంలో ఉద్యాన శాఖ ఇన్స్పెక్షన్ అధికారి రత్నాచార్యులు, డీహెచ్ఓ ప్రసాద్‌రావు బుధవారం పర్యటించారు. గ్రామీణ సహజ రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులను కలిసి పలు సలహాలు అందజేశారు. రైతు సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సంఘం చైర్మన్, సీఈఓ మామిడి వెంకట సూర్యానారాయణ, బోర్డు సభ్యులతో మాట్లాడి సంఘం అభివృద్ధికి తీసుకుంటున్న పలు విషయాలను తెలుసుకున్నారు. ఉద్యాన శాఖ శ్రీకాకుళం వారు ఇచ్చిన రాయితీతో నిర్మాణం చేపడుతున్న కలెక్షన్ సెంటర్, సోలార్ కోల్డ్ స్టోరేజ్‌ను తనిఖీ చేశారు. హార్టికల్చర్ ఏఓ హాయంతి, రైతులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదస్థితిలో ఉన్న బ్రిడ్జి

సరుబుజ్జిలి: ఏమాత్రం ఏమరపాటుగా ప్రయాణాలు చేసినా ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలో యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌పై నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ల పరిశీలన



ప్రయోజనాలను వివరిస్తున్న డైరెక్టర్ రత్నాచార్యులు

కొత్తూరు: గిరిజన ఉత్పత్తుల కోసం ప్రభుత్వం నిర్మించిన కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్‌లు వినియోగించుకోవడం వల్ల గిరిజన రైతులు గిట్టుబాటు ధర పొందవచ్చునని ఉద్యానవనశాఖ అడిషినల్ డైరెక్టర్ ఎస్.వి. రత్నాచార్యులు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి, పల్లగూడ, అడ్డంగి గిరిజన గ్రామాల్లో ఆదివాసీ రైతు ప్రగతి సరస్పర సహాయ, సహకార సంఘం ద్వారా 75 శాతం రాయితీపై నిర్మించిన కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌లను బుధవారం అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాదరావు, స్థానిక ఉద్యానవన అధికారి హాయింతి పరిశీలించారు. అనంతరం గిరిజన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. గిరిజనలు పండించిన పలు రకాల పంటలను కలెక్షన్‌కు తీసుకువచ్చి గ్రేడింగ్ చేసుకోవడం వల్ల ఎక్కువ ధర పొందవచ్చునన్నారు. మార్కెట్‌లో తక్కువ ధర ఉన్నప్పుడు కోల్డ్ రూమ్‌లలో పంటను నిల్వ ఉంచుకోవచ్చన్నారు. మంచి ధర వచ్చిన వెంటనే పంటలు విక్రయించుకోవచ్చున్నారు. ఈ విధానం వల్ల దళారీలు లేకుండా నేరుగా గిరిజనలు తమ పంటలను విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. గ్రేడింగ్ చేయడం ద్వారా పంటకు మంచి గిరాకీ ఉంటుందన్నారు. ప్రతీ గిరిజన రైతులు కలెక్షన్ సెంటర్‌లు, కోల్డు రూమ్‌లు వినియోగించుకోవాలని కోరారు. వెలుగు ఎన్జీఓ కార్యదర్శి బి.సంజీవరావు, విలేజ్ ఉద్యానవన సహాయకులు లక్ష్మితోపాటు రైతు ఉత్పత్తి కేంద్రాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వేసవి దుక్కిలు



తురకపేట ప్రాంతంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కిలు చేస్తున్న రైతు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు పొలాల దుక్కిల్లో బిజీగా ఉన్నారు. ఖరీఫ్ వరిసాగు సీజన్ జూన్‌లో ప్రారంభిస్తామని, అప్పటికి పొలాలను దుక్కి చేసి సిద్ధం చేసుకోవాలని చెబుతున్నారు. ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో వరి వెదజల్లే పద్ధతిలో సాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి వెదలు జల్లాలంటే పొలాన్ని ఇప్పటి నుంచే మెత్తగా దుక్కిచేసి సిద్ధంగా ఉంచుకోవలసి ఉంటుందని దబ్బపాడు, మిరియాపల్లి, తురకపేట గ్రామాలకు చెందిన రైతులు పల్లి అప్పలనాయుడు, ఎన్ వైకుంఠరావు, చింతాడ రమణ తదితరులు చెప్పారు. ఎల్.ఎన్.పేట మండలంలో 10,850 ఎకరాల వరిసాగు విస్తీర్ణం కాగా.. ప్రతీ ఏడాది 10 వేల ఎకరాలకు పైనే వరి సాగవుతుందని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో సాగు జరిగేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు వేసవి దుక్కిలు లోతుగా చేయాలని సూచించారు.

వారం రోజుల్లో తాగునీరు

- లక్ష లీటర్ల వాటర్ ట్యాంకు సిద్ధం
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీకి జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.2.47 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అందులో భాగంగా పాతపట్నంలో లక్ష లీటర్ల వాటర్ ట్యాంకు (సంప్) నిర్మాణం పనులు పూర్తియ్యాయని, వారం రోజుల్లో తాగునీరు అందిస్తామని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో మహేంద్రతనయ నది ఒడ్డున తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన అమ్మవారి ఉత్సవాలకు పాతపట్నం పంచాయతీకి తాగునీరు అందజేస్తామన్నారు. పాతపట్నం పండగలకు అన్ని వీధులకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్, శానిటేషన్ సమస్యలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్ పనులకు ఇతర ప్రాంతాల నుంచి 100 మందిని తీసుకువస్తున్నామని, వారికి పలు వీధులకు కేటాయిస్తామని ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా ఎమ్మెల్యేకు తెలిపారు. తాగునీరు, శానిటేషన్, విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు చూడాలన్నారు. ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, బి.నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, నీలమణి ఆలయ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, ఈఓ కూర్మారావు, జి.రాము, ఎం.వరదరాజు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: భూకబ్జాదారుడు, టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ చేసిన అక్రమాలను బయటపెట్టేందుకు తాను సిద్ధమని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పూర్తి ఆధారాలతో కూన రవికుమార్ అక్రమాలు, అవినీతిని బహిరంగం చేస్తానన్నారు. బహిరంగ చర్చకు వస్తానని పత్రికల్లో కూన ప్రకటించారని, దమ్ముంటే తేదీలు ప్రకటించాలన్నారు. కూన రవికుమార్ భూకబ్జాలు, అక్రమ మైనింగ్‌పై పలు ఆధారాలు తన వద్ద ఉన్నాయని, దమ్ముంటే వీటిపై బహిరంగ చర్చకు వచ్చి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలన్నారు. న్యాయ నిర్ణేతలుగా కొందరు ప్రజా సంఘాల నేతలు, జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాదులను పిలిచి వారి ముందు బహిరంగ చర్చ నిర్వహిద్దామన్నారు. చర్చ అనంతరం వారు కూన రవికుమార్ సచ్ఛీలుడని ప్రకటిస్తే.. నా జీవితంలో ఆయన గురించి ఎప్పుడూ మాట్లాడనని చింతాడ రవికుమార్ అన్నారు.

ముగిసిన గ్రామ పండగలు



కొత్తూరు: కుద్దిగాంలో ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, భక్తులు

కొత్తూరు: మండలంలోని కుద్దిగాం గ్రామ దేవత రూపునిమాత పండగలు బుధవారంతో ముగిశాయి. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ పండగలు ఈ నెల అయిదో తేదీన ప్రారంభయ్యాయి. గ్రామ దేవతకు ముర్రాటలు, ఘటాలతో చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. ఐదు రోజలపాటు గ్రామంలో పలు సాంస్కృతిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. కాళీమాత వేషాధరణలు ఆకుట్టుకున్నాయి. ఆఖరి రోజు ప్రతీ ఇంట్లో విందు పెట్టడంతో గ్రామం ప్రజలతో నిండిపోయింది.

ఆదిలక్ష్మి అమ్మవారి పండగలు

జలుమూరు: మండల కేంద్రం జలుమూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న ఆదిలక్ష్మి అమ్మవారి పండగలు బుధవారం విందుతో కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం పది గంటలు నుంచి ప్రారంభమైన ఈ విందులు సాయంత్రం వరకు జరిగాయి. జలుమూరు ప్రధాన వీధి నల్లనాగుల, కాపు, ఎస్సీ కాలనీ, కోవెల వీధి, తదితర వీధులు, ఆస్పత్రి రోడ్డు సైతం జనాలతో కిక్కిరిసిపోయింది. తిరుగు ప్రయాణంతో చల్లవానిపేట నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటలు వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.



జలుమూరు: చల్లవానిపేటలో నిలిచిన ట్రాఫిక్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అన్ని వర్గాల వారి అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలుచేశారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపైన ఉందన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి పనిచేసి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషితో పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వంశధార జలాలను తాగునీరుగా అందించేందుకు ప్రభుత్వం నుంచి రూ.265 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అందరి సంక్షేమాన్ని కోరుతున్న వైఎస్సార్‌సీపీని, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, ముగడ జనార్దన, రెడ్డి సీతారాం, లోచర్ల మల్లేశ్వరావు, లుకలాపు సుధీర్, బలగ గోవిందరావు, రెడ్డి లక్ష్మణరావు, తలసముద్రం శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో గురువారం సచివాలయం భవనం ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొంటారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని నాయకులు, అభిమానులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వివాదాల్లేకుండా రీసర్వే పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: రైతుల మధ్య వివాదాల్లేకుండా భూముల రీసర్వేను పూర్తి చేయాలని తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్వే సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర రీసర్వేను చేపట్టిందన్నారు. సర్వే సమయంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసకోవాలన్నారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా రైతుకు తెలియజేయాల్సిన బాధ్యత సర్వే సిబ్బందిపై ఉందన్నారు. ఇప్పటివరకు సర్వే పూర్తి చేసిన రెవెన్యూ గ్రామాల్లో సరిహద్దుల గుర్తింపు పూర్తిచేయాలన్నారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పరిశీలన



యూనిఫాంను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష

సారవకోట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి చేరిన జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యతా ప్రమాణాలను సమగ్ర శిక్ష సిబ్బంది శ్రీనివాసరావు, సుధాకర్ బుధవారం పరిశీలించారు. యూనిఫాం, నోట్ బుక్స్, బ్యాగులు వచ్చాయి. వీటిని తప్పనిసరిగా పరిశీలించి తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాణ్యత లేనివి తిరిగి పంపించాలని ఎంఈఓ ఎం.వి.రమణను సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

సంతబొమ్మాళి: ఎం.నర్సాపురం గ్రామానికి చెందిన అవాళ లచ్చమ్మ కొద్దిరోజులుగా కేన్సర్‌తో బాధపడుతోంది. దీంతో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం మనబడి అసోసియేషన్ సభ్యులు వెంకట్, ఎన్ఆర్ఐ గోపాల్‌లు రూ.15 వేల ఆర్థిక సాయం బుధవారం అందజేశారు.

రోగుల అవస్థలు..



ఆరుబయటకు వచ్చిన రోగులు, బంధువులు



చీకటిలో ఉన్న బాలింతల వార్డు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి రోగులు, బంధువులు అవస్థలు పడ్డారు. పట్టణంలోని బజారు వీధిలో గల నక్క వీధి వద్ద విద్యుత్ కండక్టర్ కట్ అవడంతో రాత్రి 11 సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇదే సమయంలో ఆస్పత్రిలో జనరేటర్ పనిచేయకపోవడం, వార్డుల్లో ఇన్వర్టులు మొరాయించాయి. దీంతో రోగులు ఉక్కపోతతో తీవ్ర అలసటకు గురయ్యారు. బాలింతలు, ఇతర రోగులు అవస్థలు పడ్డారు. వేడి తీవ్రత అధికంగా ఉండటం, గాలి రాక, చీకటిలో ఉక్కిరిబిక్కిరయ్యారు. సుమారు గంట సమయం రోగులు ఇబ్బందిపడ్డారు. ఉదయానికి సమస్యను గుర్తించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ వెంటనే చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచనలతో వెంటనే జనరేటర్లు పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. వార్డుల్లో ఇన్వర్టర్‌లను కూడా మరమ్మతులు చేయించారు. ఈ సమస్యను సూపరింటెండెంట్ వద్ద ప్రస్తావించగా.. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా.. ముందు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.

• నిర్లక్ష్యం..!



ఏబీ రోడ్డుపై కనీస జాగ్రత్తలు లేకుండా గజాలతో వెళుతున్న వాహనం

ఎల్.ఎన్.పేట: మండలంలోని అలికాం–బత్తిలి(ఏబీ) రోడ్డులో కనీస జాగ్రత్తలు పాటించకుండా నిర్మాణ సామగ్రి వాహనాలు ప్రయాణిస్తున్నాయి. భవన నిర్మాణాలకు ఉపయోగించే గజాలు తీసుకుని వస్తున్న వాహన యజమానులు, డ్రైవర్లు కనీస జాగ్రత్తలు పాటించటం లేదని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గజాలను తీసుకువెళుతున్న వాహనాలకు వెనుక ఎరుపు రంగు క్లాత్ (జెండా)లను కట్టాల్సి ఉంది. గజాలు జారిపడకుండా గట్టిగా కట్టాల్సినప్పటికీ కనీస జాగ్రత్తలు పాటించటం లేదు. రోడ్డుపై మితిమీరిన వేగంతో వెళుతుండటంతో వెనుక వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల్లోను ప్రయానించాలంటే భయమేస్తుందని వాహనదారులు చెబుతున్నారు. గజాలను తీసుకుని వెళుతున్న వాహనం సడన్‌గా ఆగితే వెనుక వస్తున్న వాహనదారులకు ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. గజాల లోడుతో వెళుతున్న వాహనదారులు కనీస జాగ్రత్త తీసుకునేలా పోలీసులు, రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేన్సర్ బాధిత చిన్నారికి సాయం

కంచిలి: మండలంలోని చిన్నశ్రీరాంపురం గ్రామానికి చెందిన కేన్సర్ బాధిత చిన్నారి లండ యోగేంద్ర వైద్యం కోసం జనసేన సేవా సమితి సభ్యులు రూ.13 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామానికి చెందిన బ్రాంచి పోస్టు మాస్టర్ మాదిన రాజేశ్వరరావు చేతులమీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో రవి, కూర్మారావు, ప్రదీప్, సంతోష్, కార్తీక్, శివతేజ, వినయ్, శ్రీను పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

షట్టర్లు బాగుచేయాలి



కొత్తకోట మినీరిజర్వాయర్ వద్ద పనిచేయని షట్టర్

సరుబుజ్జిలి: మండలంలోని ఏఎల్‌నగరం నుంచి పురుషోత్తపురం వరకు సుమారు 16 కిలో మీటర్లు మేర వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, 22 పిల్ల కాలువలు విస్తరించి ఉన్నాయి. వీటి ద్వారా నాలుగు వేల హెక్టార్లకు సాగు చేస్తున్నారు. 14 కిలో మీటర్లు మేర యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్ విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా సుమారు 2 వేల హెక్టార్ల భూమి సాగు జరుగుతుంది. వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, పిల్ల కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్ల నిర్వహణ సక్రమంగా లేదు. చెక్‌డ్యామ్‌లు, షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీటిని మళ్లించడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సాగునీరు వృథాగా పోవడం తప్ప నిల్వ చేయడానికి అవకాశం లేకుండా పోతుంది. అత్యవసర పరిస్థితుల్లో చుక్కనీటి కోసం నానా కష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

వేసవి క్రీడా శిబిరాలు వినియోగించుకోవాలి



నరసన్నపేట: క్రీడాకారులతో తైక్వాండో అసోసియేషన్ సభ్యులు



కొత్తూరు: చిత్రలేఖనాలను చూపిస్తున్న చిన్నారులు

నరసన్నపేట: వేసవిలో క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ క్రీడా శిబిరాలను క్రీడాకారులు వినియోగించుకోవాలని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను అన్నారు. స్థానిక జూనియర్ క్రీడా మైదానంలో బుధవారం పుట్‌బాల్, తైక్వాండో శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఇటువంటి శిక్షణ శిబిరాలు నిర్వహించడం చాలా అవసరమని, దీనిని ప్రభుత్వం గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. ఈ 30 రోజులు క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో పుట్‌బాల్, తైక్వాండో క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. పుట్‌బాల్ కోచ్ రాజేష్, అసోసియేషన్ ప్రతినిధులు సుగుణ కుమార్, పీఈటీ గోపి, ఫెన్సింగ్ కోచ్ వంశీ, తైక్వాండో ఇన్‌స్ట్రక్టర్ హరి తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలతో లాభాలెన్నో..

పొందూరు: స్థానిక వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారి పీవీ భాస్కరరాజా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులతో నీతి కథలు చదివించారు. నీతి కథలు వినడంతో ఎన్నో లాభాలు ఉన్నాయి. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రలేఖనాలు..

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవిజ్ఞాన శిబిరాలలో భాగంగా బుధవారం గ్రంథాలయానికి వస్తున్న చిన్నారులకు పలు రకాల పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం వేయడం వంటి అంశాలు నిర్వహించారు. విద్యార్థులు గీచిన చిత్రలేఖనాలు పులువురికి ఆకట్టుకున్నాయి. చిన్నారులు గీచిన చిత్రాలకు అభినందించారు.



పొందూరు: నీతి కథలు చదువుతున్న విద్యార్థులు